# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-08-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఉద్యోగుల సామాజిక భద్రత కోసం కేంద్రం ఏకీకృత పింఛన్ పథకానికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది**

2. **రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 30 వ తేదీన వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ తెలిపారు**

3. **ఫార్మా సంస్థ ప్రమాద ఘటనలో బాధిత కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందిస్తాయని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు**

4. **తెలంగాణలో ఒక్క మంకీ పాక్స్ కేసు కూడా నమోదు కాలేదని ఆ రాష్ట్ర ప్రజారోగ్య సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ తెలిపారు.**

5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం ఈ ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

=========================

దేశంలో నక్సలిజంతో పోరాటం తుది దశకు చేరుకుందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. నిన్న ఆయన ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌లో నిర్వహించిన అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశంలో కేంద్ర మంత్రి పాల్గొని మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ, మౌలిక సదుపాయాల కల్పన, ఎదురవుతున్న సవాళ్ళపై చర్చించామని తెలిపారు. గత 10 సంవత్సరాలుగా దేశంలో 6 వేల మందికి పైగా భద్రతా సిబ్బంది, పౌరులు మరణించారన్నారు. అయితే దేశంలో నక్సలిజం వల్ల భద్రతా దళాలు, పౌరుల మరణాలు 70 శాతం తగ్గాయని పేర్కొన్నారు. సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సరైన వ్యూహంతో ముందుకు వెళతామని... 2026 నాటికి నక్సలిజం నుండి దేశానికి విముక్తి కల్పిస్తామని హోం మంత్రి ఉద్ఘాటించారు.

-------------------------

ఉద్యోగుల సామాజిక భద్రత కోసం కేంద్రం ఏకీకృత పింఛన్ పథకానికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ తెలిపారు. నిన్న ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమోదించిన మంత్రివర్గ నిర్ణయాలను పాత్రికేయులకు వెల్లడించారు.

ఈ నూతన ఏకీకృత పెన్షన్ పథకం ద్వారా 23 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు భరోసా కల్పించేలా ఏకీకృత పింఛన్ పథకం రూపొందించచామని కేంద్రమంత్రి పేర్కొంటూ,అలాగే కేంద్ర మంత్రివర్గం బయో ఈ-3 విధానంతో పాటు విజ్ఞాన్ ధార, 11, 12వ తరగతి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌నకు కల్పనకు ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని అచ్యుతాపురం ఫార్మా సంస్థ ప్రమాద ఘటనలో బాధిత కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరపున సహకారం అందిస్తాయని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. అనకాపల్లి జిల్లాలో ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని స్థానిక శాసన సభ్యులు విజయ్‌కుమార్‌తో కలిసి గత రాత్రి ఆయన పరిశీలించారు. అనంతరం అనకాపల్లి స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి, క్షతగాత్రులకు అందుతున్న వైద్య వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు, కార్మికులకు సౌకర్యాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. అచ్యుతాపురంలో ఈఎస్ఐ ఆసుపత్రి, ట్రామా సెంటర్ల ఏర్పాటుకు కృషి చేస్తామని కేంద్ర మంత్రి పేర్కొంటూ,

---------------------------

ఆంధ్రప్రదేశ్ అచ్యుతాపురం పారిశ్రామిక వాడలో జరిగిన ప్రమాద ఘటన పై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరుపుతోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్. తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం లో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రమాదం జరిగిన కొన్ని గంటల్లోనే ఘటన స్థలానికి చేరుకుని అప్పటికి ఉన్న ప్రాధమిక సమాచారం మేరకు ముగ్గురు చనిపోయినట్లు తెలిపామని చెప్పారు. ప్రమాద ఘటనపై ప్రభుత్వాన్ని విమర్శిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో నగరాలు, పట్టణ ప్రాంతాల్లో నగర వనాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ తెలిపారు. నిన్న అమరావతిలో అటవీ శాఖ అధికారులతో ఉపముఖ్యమంత్రి నగర వనాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,రాష్ట్ర వ్యాప్తంగా 11 నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీల పరిధిలో నూతనంగా నగర వనాల అభివృద్ధి కోసం తొలి విడతగా కేంద్రం 15.4 కోట్ల రూపాయలను మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో కర్నూలు, కడప, నెల్లిమర్ల, చిత్తూరులో రెండు, శ్రీకాళహస్తి, తాడేపల్లిగూడెం, పెనుకొండ, కదిరి, పలాస, విశాఖపట్నంలో నగరవనాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో పచ్చదనం 50శాతం మేరకు ఉండాలని, ఇందులో భాగంగా నగర వనాలు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. ఈ నెల 30న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఉపముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

---------------------------

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు తెలంగాణ ఆర్థిక స్థితిగతులను వివరించి నిధులు కేటాయించాలని కోరామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. నిన్న ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసిన అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, విభజన చట్టంలో పేర్కొన్న మేరకు తెలంగాణకు రావాల్సిన నిదులు గురించి ఆర్థిక మంత్రికి వివరించామని తెలిపారు. 2014-15లో కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించిన రెండు రాష్ట్రాల నిధులను ఆంధ్రప్రదేశ్ ఖాతాలోనే జమ చేశారని అందులో తెలంగాణ వాటాను ఇప్పించాలని

కోరినట్లు పేర్కొన్నారు . వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి సంబంధించి 2019-20 నుంచి 2023-24 సంవత్సరాలకు రావాల్సిన నిధులు కూడా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం చెప్పిన 8 అంశాలపై నిర్మలాసీతారామన్ సానుకూలంగా స్పందించారని త్వరలోనే కేంద్ర, రాష్ట్ర అధికారులతో ఒక సమావేశం ఏర్పాటు చేసి పరిష్కార మార్గం చూపిస్తామని తెలిపారని భట్టి విక్రమార్క వివరించారు

-------------------------

తెలంగాణలో ఒక్క మంకీ పాక్స్ కేసు కూడా నమోదు కాలేదని ఆ రాష్ట్ర ప్రజారోగ్య సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ తెలిపారు. నిన్న హైదరాబాద్ లో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, మంకీ పాక్స్ వైరస్ వ్యాప్తి చెందే అవకాశం ఉందన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ - డబ్ల్యూహెచ్‌వో హెచ్చరికలతో అప్రమత్తంగా ఉన్నామన్నారు. ఇందుకోసం హైదరాబాద్ లోని గాంధీ ఆస్పత్రిలో మంకీ పాక్స్ కోసం ప్రత్యేకంగా ఐసోలేషన్ పడకలు ఏర్పాటు చేశామని తెలిపారు.

-------------------------

తెలంగాణలో వరంగల్ పట్టణాన్ని మరో పెద్ద నగరంగా తీర్చిదిద్దడానికి బృహత్ ప్రణాళిక సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నిన్న హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ అధికారులతో వరంగల్ నగర అభివృద్ధి పై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణలో హైదరాబాద్ నగరం తర్వాత వరంగల్ పట్టణాన్ని విస్తృత పరచడానికి, పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. 2050 నాటి జనాభాను దృష్టిలో ఉంచుకొని పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రతిపాదనలు రూపొందించాలని, ఇందుకు అవసరమైన భూముల సేకరణ చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

-------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ మనసులోని మాట" కార్యక్రమం 113వ సంచిక ఈ రోజు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్ వర్క్, ఏఐఆర్ న్యూస్ వెబ్ సైట్ ద్వారా న్యూస్ ఆన్ ఎయిర్ మొబైల్ యాప్‌లో ప్రసారం కానుంది. మన్ కీ బాత్ హిందీ ప్రసంగం ప్రసారమైన వెంటనే అన్ని ఆకాశవాణి ప్రాంతీయ భాషల్లో దీని అనువాదం ప్రసారం అవుతుంది.

=====================